అయ్యప్ప పూజలో మాజీ మంత్రి

పూజ చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 4: జిల్లా కేంద్రంలోని కౌన్సిలర్ అలైఖ్య తిరుమల్ నిర్వహించిన అయ్యప్ప స్వామిపూజలో బుధవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. గణపతి హోమం, పటం పూజ, స్వాముల భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం ముత్తుకృష్ణ గురుస్వామి మాజీమంత్రికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదే విధంగా అలైఖ్య తిరుమల్ శాలువాతో మంత్రిని సన్మానించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, బీచుపల్లియాదవ్, అశోక్, సయ్యద్ జమీల్, చిట్యాల రాము ఉన్నారు.

డేటా ఎంట్రీ ప్రక్రియ వేగవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి టౌన్, డిసెంబర్ 4 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటాను వేగవంతంగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో డేటా ఎంట్రీ ప్రక్రియపై ఎంపీడీవోలు, తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం వీసీ నిర్వహించారు. ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు.

ఇంకా సర్వే చేయకుండా మిగిలిపోయిన ఇండ్లను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో యాదయ్య, సీపీవో భూపాల్‌రెడ్డి, అధికారులు తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ఫారెస్ట్ రేంజ్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, డిసెంబర్ 4 : జిల్లాలో విరివిరిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో నూతనంగా నిర్మించిన ఫారెస్ట్ రేంజ్ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఫారెస్ట్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు సుభాన్, గట్టుతిమ్మప్ప, గడ్డంకృష్ణారెడ్డి, బండారి భాస్కర్, వేణుగోపాల్, రమేశ్‌నాయుడుతో పాటు ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీలు అందజేత

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గద్వాల మున్సిపాలిటీలో తహీరా బేగం వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.3.20లక్షల విలువ గల ఎల్‌వోసీ, గద్వాల మండలంలోని గుర్రంగడ్డ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డికి చికిత్సకు మంజూరైన రూ.5లక్షల ఎల్‌వోసీ, గద్వాల మండలం గోన్‌పాడ్ గ్రామానికి చెందిన రేష్మాకు మంజూరైన రూ.2లక్షల ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. గద్వాల మండలంలోని పూడురు గ్రామానికి చెందిన పరశురాముడికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.27వేలు, 6వ వార్డుకు చెందిన వేణుకు మంజూరైన రూ.52వేల చెక్కును బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు.

యూనిఫాం అందజేత

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గద్వాల నియోజకవర్గంలోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న 4,112 మంది చిన్నారులకు ఏకరూప దుస్తులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు నాయకులు గడ్డంకృష్ణారెడ్డి, అధికారులు సుధారాణి పాల్గొన్నారు.

చెరుకు రైతులకు మద్దతు ధర కల్పించాలి

అమరచింత చెరుకు రైతుల సమస్యలపై చెరుకు పరిశ్రమ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర చెరుకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి

అమరచింత, డిసెంబర్ 4: చెరుకు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధర రూ.4వేలతో పాటు రూ.వెయ్యి బోనస్‌ను చెల్లించాలని తెలంగాణ చెరుకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెరుకు రైతులకు మద్దతు ధర, బోనస్ తోపాటు యంత్రాలను సబ్సిడీ పై అందించాలని రాష్ట్ర చెరుకు పరిశ్రమ కమిషనర్‌ను తెలంగాణ చెరుకు రైతుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లుగా గోపి తెలిపారు.

వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర కార్యదర్శి బొంతు రాములు, సహాయ కార్యదర్శి శోభన్ తదితరులు ఉన్నారు.

ఐదేండ్లలోపు పిల్లలందరికీ టీకాలు వేయాలి

టీకా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి

పెబ్బేరు, డిసెంబర్ 4 : ఐదేండ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వ్యాధి నిరోధకాల అధికారి పరిమళ అన్నారు. బుధవారం ఆమె పెబ్బేరు, కంచిరా వుల్లి, రంగాపురంలోని ఆరోగ్య ఉప కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి బుధవారం ఉపకేంద్రాలు, ప్రతి శనివారం ఔట్‌రిచ్ టీకా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పెబ్బేరు పీహెచ్‌సీ డాక్టర్ హరినారెడ్డి, సిబ్బంది చంద్రయ్య, లీలమ్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్ఎస్‌పీపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు సురేశ్

పెద్దమందడి, డిసెంబర్ 4 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ గురుకుల మాజీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై మంత్రి కొండా సురేఖ, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి చేసిన వ్యాఖ్యలపై భేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు పానుగంటి సురేశ్ డిమాండ్ చేశారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రాక ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో 300 గురుకులాలు ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ చలువతో విద్యపై ఉన్న మక్కువతో గురుకులాల కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 1000 గురుకుల పాఠశాలలు స్థాపించారని గుర్తుచేశారు. అందులో చదువుకున్న విద్యార్థులకు చదువుపై ప్రత్యేకశ్రద్ధ పెట్టి ఎందరో విద్యార్థులను డాక్టర్లు, లాయర్లు, ఐఏఎస్‌లుగా తీర్చిదిద్దారని, అదేవిధంగా మారుమూల గ్రామాల్లో ఉన్నటువంటి గిరిజన బిడ్డలను ఎవరెస్ట్ శిఖరం ఎక్కించి గురుకులాల ఖ్యాతిని చాటిన గొప్ప వ్యక్తి ఆర్ఎస్పీ అని అలాంటి మహనీయునిపై కుసంస్కార మాటలు మంచిది కాదని హితవు పలికారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే అన్ని గురుకులాల పాఠశాలలు, కేజీబీవీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్పీపై మంత్రి, ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అమరచింత కస్తూర్బా పాఠశాల విద్యార్థినులతో సమస్యలను తెలుసుకుంటున్న బీఆర్ఎస్వీ నేతలు

పేద విద్యార్థులపై ప్రభుత్వం కక్ష సాధింపు

అమరచింత, డిసెంబర్ 4: పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కస్తూర్బా విద్యాలయాలను నెలకొల్పి సరస్వతీ నిలయాలుగా మారిస్తే కాంగ్రెస్ వాటిని నిర్వీర్యం చేస్తుందని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు రియాజ్ అలీ విమర్శించారు. బీఆర్ఎస్వీ కస్తూర్బా బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో ఉన్న కస్తూర్బా పాఠశాలను బుధవారం తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కస్తూర్బా పాఠశాలలను ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తూ విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతూ అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలను విరమించుకుని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం తోపాటు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కేజీబీవీలో విద్యార్థినులతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకుడు సురేశ్

రైతులు నాణ్యతను పాటించాలి

ఇటిక్యాల, డిసెంబర్ 4 : కొను గోలు కేంద్రాలకు ధాన్యాన్ని తెచ్చే రైతులు నాణ్యతను పాటించి తీసుకొని రావాలని పుటాన్ దొడ్డి వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ రంగారెడ్డి సూచించారు. మండలంలోని మునుగాల గ్రామంలో బుధవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు 17శాతం తేమ ఉండే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర, బోనస్ పొందాలని సూచించారు.

సహకార బ్యాంక్ ద్వారా రుణాలు

వాణిజ్య బ్యాంకులకంటే సులభతరంగా సహకార సంఘం బ్యాంక్ ద్వారా రైతులకు రుణాలను అందజేస్తామని సహకార బ్యాంక్ మేనేజర్ రాధ అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సహకార బ్యాంకులో కర్షక మిత్ర, గృహరుణాలు, వాహనరుణాలు, విద్యా రుణాలు, గోల్డ్‌లోన్లు సులభతరంగా అందిస్తామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో శ్రీనివాస్‌రెడ్డి బ్యాంక్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వడ్డేపల్లి, డిసెంబర్ 4 : శాంతినగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకం ధాన్యానికి రూ.2,300, ప్రభుత్వం సన్నరకాలకు బోనస్ 500 అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ సుజాత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుమార్, చిన్నిబాబు, మైనుద్దీన్, రామకృష్ణారెడ్డి, జయరామిరెడ్డి, గోవిందు, ఈశ్వర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 4 : ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన సేవలు అందించాలని న్యాయమూర్తి మిథున్‌తేజ అన్నారు. బుధవారం అలంపూర్ మండలంలో టీజీ వెంకటేశ్ ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖానలో వికలాంగుల, మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా దవాఖానలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రోగులకు వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయని రోగులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దవాఖానలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్ కుమార్, న్యాయవాదులు నారాయణరెడ్డి, వెంకటేశ్, వెంకట్రాముడు, గజేంద్ర, సాయితేజ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

ధరూరు, డిసెంబర్ 4 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈవో రవీంద్ర బాబు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎంజేపీటీబీసీ, జెడ్పీహెచ్‌ఎస్‌లను బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఫిల్టర్ నీటినే భోజనం తయారీకి వినియోగించాలని సూచించారు. తాజా కూరగాయలనే పిల్లలకు వండిపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు సీఆర్పీ బతుకన్న, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఖిల్లా ఘణపురం, డిసెంబర్ 4: మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థ్య క్యాంప్) ఆధ్వర్యంలో కంటి పరీక్ష నిర్వహించారు. పాఠశాలలోని మొత్తం 225మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 9మంది విద్యార్థులకు కంటి లోపం ఉన్నట్లు గుర్తించామని, కళ్లద్దాలను అందజేయనున్నట్లు హెచ్‌ఎం కాళిదాస్ చెప్పారు. విటమిన్ లోపం వల్ల కంటి సమస్యలు ఏర్పడతాయని విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ స్వప్న, డాక్టర్ రఘు చెప్పారు. కార్యక్రమంలో అప్తాలమిక్ ఆఫీసర్ మురళి, రఘునందన్, ఉపాధ్యాయులు హరిలాల్, దేవేందర్, ఎమ్మార్సీ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

90 రోజుల్లో ప్రణాళికా పక్కాగా అమలు చేయాలి

మల్దకల్ కళాశాలలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఐఈవో హృదయరాజు

మల్దకల్, డిసెంబర్ 4 : ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి 90రోజుల్లో ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని డీఐఈవో హృదయ రాజు అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో మానసికంగా, ప్రశాంతంగా రాయటానికి సైకాలజిస్టులు మానసిక వైద్య నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, దీని కోసం ప్రభుత్వం టెలిమానస్ అనే కొత్త కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు, డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అవగాహన కోసం ప్రత్యేక పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నర్సింహులు, అధ్యాపకులు రామాంజనేయులు, గోవర్ధన్ శెట్టి, భాగ్యలక్ష్మి, జయరాం, తిమోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

రేవల్లి, డిసెంబర్ 4 : ధాన్యం కొను గోలుపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మండలంలోని తల్పునూర్‌లో ధాన్యం కొను గోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సెంటర్‌కు టెంటు, తాగునీరు, ఫ్యాన్ ఉండాలని ఏపీవో సూచించారు. కేంద్రానికి వచ్చే ధాన్యం తేమ శాతం పరీక్షించి తూకం వేసి లోడ్ చేయాలని సూచించారు. రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం తల్పునూర్ పాఠశాలను పరిశీలించి తలుపులు, కిటికీలు మరమ్మతులు చేసి గేట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు ఆదేశించారు. విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. అనంతరం రేవల్లి కస్తూర్బాలో కూరగాయలు, రికార్డులను పరిశీలించారు. భోజనం సూపర్ వైజర్లు తిన్న తర్వాత విద్యార్థులకు వడ్డించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. పాఠశాలలో సమస్యలు ఉంటే తన దృష్టి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో యాదయ్య, డీపీఆర్వో సీతారాం, తాసిల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో నర్సింహులరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ అదర్శ సురభి

వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సమిష్టిగా పనిచేయాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, డిసెంబర్4 : వైద్య కళాశాలలో వైద్య సేవలు మెరుగుదలతోపాటు విద్యార్థుల విద్యా స్థాయిని పెంపొందించేందుకు వైద్యులు, మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు, దవాఖాన సిబ్బంది సమిష్టిగా పని చేయాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. కలెక్టరేట్‌లో వైద్య సేవల మెరుగుదల, జిల్లా వైద్యకళాశాల అభివృద్ధిపై వైద్యశాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు తమ విధులను సక్రమంగా నిర్వహించి హాజరును పక్కాగా పాటించాలన్నారు. ప్రతి శాఖలో ఉన్న సౌకర్యాలు, పరికరాలు, సిబ్బంది వివరాలను హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ నుంచి తెలుసుకొని వాటి నిర్వహణపై పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్ల కొరతపై ప్రస్తావిస్తూ త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసి ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోగులను కర్నూల్‌కు రెఫర్ చేయకుండా అన్ని రకాల వైద్య సేవలను గద్వాల జిల్లా దవాఖానలో అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమం అను కరపత్రికను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సిద్ధప్ప, వినోద్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘణపురం, డిసెంబర్ 4: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మండలంలోని రోడ్డుమీదితండాలో బుధవారం సేవాలాల్ మహారాజ్ సామూహిక భవన నిర్మాణానికి శంకుస్థాపన, అప్పారెడ్డిపల్లి గ్రామంలో బీసీ ప్లాట్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, సల్కలాపురం నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, మండల కేంద్రంలో అటవీ శాఖ కార్యాలయం, వసతి గృహ ప్రారంభోత్సవం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 102 సేవలను ప్రారంభోత్సవం, అదేవిధంగా పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి తండాలో సేవాలాల్ మహారాజ్ సామూహిక భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్లను సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రేవల్లి, డిసెంబర్ 4: రేవల్లి మండల పరిధిలో శానాయిపల్లి, నాగపూర్, గౌరి దేవిపల్లి, రేవల్లి పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి శంకుస్థాపన చేశారు. శానాయిపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసి అనంతరం ఎల్లమ్మ ఆలయం చుట్టూ సీసీ రోడ్డులను ప్రారంభించారు. గౌరిదేవిపల్లి అంగన్‌వాడీ నూతన భవనం, నాగపూర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన, కేజీబీవీ వద్ద సీసీ రహదారి నిర్మాణానికి ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాడాల పర్వతాలు, సింగిల్ విండో చైర్మన్ రఘు, నాయకులు బాల్‌రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, డిసెంబర్ 4 : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. కొత్తకోట ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. అనంతరం కొత్తకోట మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు పీపీఈ శానిటైజేషన్ కిట్లను పంపిణీ చేశారు. 7వ వార్డులో తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడంతో ఎమ్మెల్యే నిధుల నుంచి వేయించిన బోరు బావిని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తాసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో చెన్నమ్మ, మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్, చైర్‌పర్సన్ సుకేశిని విశ్వేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, వైస్ చైర్మన్ బీసం జయమ్మ, కిసాన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బోయేజ్, కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీను, నాయకులు లతీఫ్, మోహన్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అజ్జకొల్లు గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించిన వ్యవసాయ గోదాం, రూ.12లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం రైతులతో ఆయన ముచ్చటించారు. అనంతరం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రూ.12లక్షల వ్యయంతో నిర్మించనున్న సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు వెంకటనారాయణ, నాగన్న యాదవ్, జగదీశ్, వడ్డెకృష్ణ, శ్రీనివాస్ యాదవ్, కృష్ణవర్ధన్‌రెడ్డి, సాయిబాబా, అంజద్ అలీ, రామకృష్ణ, హనుమాన్‌రావు, వడ్డెరాములు, శ్రీధర్‌రెడ్డి, సత్యం, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అజ్జకొల్లులో రైతు గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

సీఎం కప్ పోటీల నిర్వహణపై సన్నాహక సమావేశం

పెద్దమందడి, డిసెంబర్ 4: సీఎం కప్ పోటీల నిర్వహణపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సద్గుణ మాట్లాడుతూ ఈనెల 7,8 తేదీల్లో గ్రామ పంచాయతీలు, 10 నుంచి 12వ తేదీ వరకు మండలస్థాయిలో నిర్వహించే ఆటలపై చర్చించినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, యోగా పోటీలను నిర్వహించి గ్రామస్థాయి జట్టును ఎంపిక చేసి ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించే మండల స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడల్లో మహిళా క్రీడాకారులు వయస్సుతో నిమిత్తం లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చని, వాలీబాల్ క్రీడకు 2007, జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో తాసిల్దార్ సరస్వతి, ఎంఈవో విష్ణు, ఎస్సై యుగంధర్‌రెడ్డి, పీడీలు మన్నెం యాదవ్, వెంకటేశ్వరరావు, రవికుమార్, వెంకటస్వామి, అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గొప్పలు మానాలి

వనపర్తి టౌన్, డిసెంబర్ 4 : కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు మాని చేతల్లో చూపించాలని బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి గంధం పరం జ్యోతి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 2022 డిసెంబర్ 1న 9,168 గ్రూపు-4 ఉద్యోగాలకు అప్పటి సీఎం కేసీఆర్ నోటిఫికేషన్‌ను ఇచ్చారని తాము ఉద్యోగ నోటిఫికేషన్ వేసి ఉద్యోగాలు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకొంటున్నారని విమర్శించారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త నోటిఫికేషన్ కూడా వేయలేదని అన్నారు. గత ప్రభుత్వ నోటిఫికేషన్లకు నియామకాలు చేపడుతున్నారని గుర్తుచేశారు.

సీడ్ ఆర్గనైజర్ల దోపిడీని అరికట్టాలి

గద్వాల అర్బన్, డిసెంబర్ 4 : జిల్లాలో సీడ్ పత్తి రైతులపై ఆర్గనైజర్ల మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, సమస్యలను పరిష్కరించి ఆర్గనైజర్ల మోసాలను అరికట్టాలని జిల్లా నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు కలెక్టర్‌ను కోరారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్‌పీఎస్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు త్రైపాక్షిక ఒప్పందం చేయాలని సూచించారు. జిల్లాలో 40వేల మందికి పైగా సీడ్ పత్తి రైతులు విత్తనపత్తిని సాగు చేస్తున్నారని, ఆయా కంపెనీ ఫౌండేషన్ సీడ్‌ను నేరుగా రైతులకు ఇవ్వకుండా ఆర్గనైజర్‌ల ద్వారా అందజేసి రైతులను నిండా ముంచుతున్నారని ఆరోపించారు. సీడ్ ఆర్గనైజర్ల దోపిడీని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్, సభ్యులు బుచ్చిబాబు, వెంకట్రాములు, భూపతి, లక్ష్మణ్, గోపాల్, ఆశన్న, దొడ్డెన్న, చిన్న రాముడు, ప్రేమ్‌రాజ్, కృష్ణ, సర్వేశ్, రమేశ్, అమరేశ్ ఉన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

గద్వాల టౌన్, డిసెంబర్ 4 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో నిరసన సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సంబురాలు నిర్వహించుకోవడం సిగ్గుచేటుగా ఉందన్నారు. రుణమాఫీ లేని లక్షల రూపాయలు విజయోత్సవాలకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఏడాదికే ప్రజల వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డుల్లోకి ఎక్కిందని ఎద్దేవా చేశారు. జిల్లాకు ఇచ్చిన హామీలు ఎక్కడికి పోయాయన్నారు. రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిన రేవంత్‌రెడ్డి సీఎంగా అనర్హుడని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి పాలనపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బండల వెంకట్రాములు, రామాంజనేయులు,వెంకటేశ్వర్‌రెడ్డి, దేవదాసు, కృష్ణవేణి, పద్మావతి, పాల్వాయి రాముడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మప్ప స్వామికి వెండి వితరణ

మల్దకల్, డిసెంబర్ 4 : ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామికి గ్రామానికి చెందిన గను ముల్ వీరన్న గౌడ్ దంపతులు 210గ్రాముల వెండి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రవిచారి వెండిని స్వామి వారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రాలయ పీఠాధిపతి రాక

మల్దకల్, డిసెంబర్ 4 : ఆది శిలా క్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేకంలోభాగంగా గురువారం మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామీజీ వస్తున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి తెలిపారు. ఆలయంలో ప్రత్యేకంగా శ్రీమూల రాములు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెద్దమందడి, డిసెంబర్ 4 : రానున్న పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా బుధవారం ఎంపీడీవో సద్గుణ మండలంలోని దొడగుంటపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద వసతులు, భద్రతా ఏర్పాట్లు , నీటి సౌకర్యం వంటి అంశాలను ఆమె సమీక్షించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆమెతో పాటు బూత్ లెవల్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో ప్రతిభ



జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన హరికృష్ణ

అయిజ రూరల్, డిసెంబర్ 4 : మండలంలోని చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన క్రీడాకారుడు హరికృష్ణ అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించాడు. నవంబర్30న యూపీలో నిర్వహించిన అండర్-19 అథ్లెటిక్స్ విభాగంలో మూడు కిలోమీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. దీంతో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు. అయితే హరికృష్ణ అయిజ పట్టణంలోని శివసాయి డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. హరికృష్ణను అధ్యాపకులతోపాటు గ్రామస్తులు అభినందించారు.